# ఉదాత్తుడు!

కుర్చీలో కూలబడిపోయాడు, ఆఫీస్‌నుంచి అలసిపోయి ఇంటికి చేరుకున్న రాజారావ్.

భర్తకి కాఫీ తీసుకొచ్చి అందించింది రమణి.

అతను కాఫీ తాగుతుంటే, అతని కాళ్ళ దగ్గర కూర్చుని బూట్లు విప్పసాగిందామె.

—ఆమె బూట్లని విప్పడం, అతను కాఫీకప్పుని ఖాళీ చెయ్యడం ఒకేసారి జరిగాయి.

కప్పుని కింద పెట్టబోతున్న రాజారావ్‌కి ఎదురు కుర్చీ క్రింద కాల్చి పారేసిన సిగరెట్ ముక్క కనిపించింది.

అంటే — రాజు మళ్ళీ వచ్చాడన్నమాట!

అతని మనసంతా చికాకైపోయింది.

ఎంత మేనత్త కొడుకైతే మాత్రం అంత తరచుగా వచ్చిపోతుండాలా? అదీ తను లేనప్పుడు!

అతనికి బుద్ధిలేకపోతే రమణి బుద్దేమైంది? 'ఆయన లేనప్పుడు రావడం బావుండదు, వున్నప్పుడే రమ్మ'ని చెప్పవచ్చుగా?

అంత ఒకళ్ళని చూడకుండా మరొకళ్ళు వుండలేనివాళ్ళయితే పెళ్ళి చేసుకోవలసింది!

చటుక్కున కుర్చీలోంచి లేచి చెప్పులు తొడుక్కున్నాడు రాజారావ్.

"అదేమిటండీ! ఇప్పుడేగా వచ్చింది, అప్పుడే ఎక్కడికి బయల్దేరారు....?'' అడిగింది రమణ.

జవాబు చెప్పాలనిపించలేదు రాజారావ్‌కి. చరచరా ముందుకు కదిలాడు.

....రోడ్లవెంట ఎంతసేపు తిరిగాడో తెలీదు. కాళ్ళ నొప్పులు పుట్టేసరికి ఎక్కడైనా కాసేపు కూర్చోవాలనిపించింది. నిర్మల గుర్తుకొచ్చింది. కాసేపు వాళ్ళింట్లో కూర్చుంటే మనస్సుకీ తృప్తిగా వుంటుంది. బయల్దేరాడు నిర్మల ఇంటివేపు.

తనని చూడగానే ఆమె ముఖంలో అనుకున్నంత ఆనందం కనిపించకపోయేసరికి లోపలికి అడుగు పెట్టడానికే ఇబ్బందిగా అనిపించింది.

''సారీ రాజారావ్ ఇలా అంటున్నానని ఏమనుకోకు. ఆయనలో నీలాంటి ఉదాత్తత లేదు. ఎప్పుడైనా వస్తే, దయచేసి ఆయనున్నప్పుడొస్తే బావుంటుంది....'' చిన్నగా అన్న ఆమె మాటలు అతనికి ఈటెల్లా తాకాయి.

చటుక్కున లేచి బయటికొచ్చేసాడు.

అతడిని ఇబ్బంది పెట్టింది ఆమె మాటలు కాదు- ఇందాక భార్యతో తన ప్రవర్తన గుర్తుకొచ్చి!

(ఈవారం వారపత్రిక)